వాయిస్ ఆఫ్ ప్రజలు
# వాయిస్ టుడే
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మనసేత్రం
Follow
పేజీలు 8
శనివారం, డిసెంబరు 6, 2025
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## యుక్త వయసు వచ్చిన ఇద్దరు వ్యక్తులు సహజీవనం చేయవచ్చు

**విన్ రిలేషన్‌షిప్ పై రాజస్థాన్ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు**

**సహజీవనం కొనసాగించేందుకు 18 ఏళ్ల మహిళ, 21 ఏళ్ల అబ్బాయికి ఉండాలి**

జైపూర్, డిసెంబర్ 5 : రాజస్థాన్ హైకోర్టు లివిన్ రిలేషన్‌షిప్ పై సంచలన వ్యాఖ్యలు చేసింది. యుక్త వయసు వచ్చిన ఇద్దరు వ్యక్తులు సహజీవనం చేయవచ్చు అని కోర్టు అభిప్రాయపడింది. ఒకవేళ ఆ ఇద్దరికీ పెళ్లి ఈడు రాకున్నా.. లివిన్ రిలేషన్‌లో కొనసాగవచ్చు అని కోర్టు వెల్లడించింది. పెళ్లి వయసు నెపంతో రాజ్యాంగ హక్కుల్ని కొట్టిపారేయలేమని కోర్టు పేర్కొన్నది. జస్టిస్ అనూప్ ధండ్ తన తీర్పులో ఈ వ్యాఖ్యలు చేశారు. 18 ఏళ్ల మహిళ, 19 ఏళ్ల అబ్బాయి.. తాజాగా రాజస్థాన్ హైకోర్టులో పిటీషన్ వేశారు. పరస్పర అంగీకారంతోనే ఇద్దరం రిలేషన్‌లో ఉన్నామని ఆ జంట కోర్టుకు చెప్పింది. 2025, అక్టోబర్ 27వ తేదీన సహజీవనం చేస్తామని ఓ ఒప్పందం కూడా కుదుర్చుకున్న విషయాన్ని ఆ జంట వెల్లడించింది.అయితే అమ్మాయికి చెందిన కుటుంబం ఆ లివిన్ రిలేషన్‌ను వ్యతిరేకిస్తున్నది.

2లో



# భగవద్గీతను పుతిన్‌కు గిఫ్టుగా ఇచ్చిన ప్రధాని మోదీ!

**న్యూఢిల్లీ, డిసెంబర్ 5 (వాయిస్ టుడే):** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ 2 రోజుల పాటు భారతదేశంలో పర్యటించేందుకు వచ్చారు. ఈ సందర్భంగా డిసెంబర్ 4, 2025 రాత్రి 7LKM వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుతిన్‌ను డిన్నర్‌కు ఆహ్వానించారు. అంతకుముందు ఇద్దరు నేతలు విమానాశ్రయం నుంచి ఒక కారులో ి చేరుకున్నారు. ప్రధాని నివాసంలో మోదీ, పుతిన్ మధ్య దాదాపు 2:30 గంటల పాటు సమావేశం జరిగింది. ప్రధాని మోదీ, పుతిన్ పలు కీలక అంశాలపై ఒంటరిగా చర్చించారు. ఆ సమయంలో ప్రధాని మోదీ పుతిన్‌కు రష్యన్ భాషలో అనువదించిన భగవద్గీతను బహుమతిగా ఇచ్చారు.దాదాపు పదిహేను సంవత్సరాల క్రితం సైబీరియాలోని టామ్స్క్ నగరంలో ఒక కేసు నమోదైంది, ఇది భారతదేశంలో రాజకీయ ప్రకంపనలు సృష్టించింది. ఇస్కాన్ ప్రచురించిన భగవద్గీత యాజ్ ఇట్ ఈజ్" రష్యన్ అనువాదంపై స్థానిక అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దానిని తీవ్రవాద సాహిత్యం అని పిలవడానికి ప్రయత్నించారు. ఆరోపణలు చాలా తీవ్రంగా

- మిగతా 2వ పేజీలో

## ఇండిగో పరిస్థితికి ప్రభుత్వ గుత్తాధిపత్యమే ప్రధాన కారణం : రాహుల్ గాంధీ



**న్యూ డిల్లీ, డిసెంబర్ 5 :** నిర్వహణపరమైన లోపాల వల్ల దేశంలోని అతి పెద్ద ఎయిర్‌లైన్ సంస్థ ఇండిగో విమాన సర్వీసులకు తీవ్ర ఆటంకం కలుగుతోన్న విషయం తెలిసిందే. గత మూడు రోజులుగా వందలాది విమానాలను సంస్థ రద్దు చేసింది నేడు కూడా దాదాపు 400కిపైగా విమానాలు రద్దయ్యాయి. ఇండిగోలో నెలకొన్న ఈ సంక్షోభంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తాజాగా స్పందించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.ఈ పరిస్థితికి ప్రభుత్వ గుత్తాధిపత్యమే ప్రధాన కారణమని

2లో

## బీసీ రిజర్వేషన్ల పేరిట సీఎం రేవంత్ రెడ్డి చేసిన దారుణమైన మోసం

**శ్రీసాయి ఈశ్వర్ అనే యువకుడి నిండు ప్రాణం బలైందని కేటీఆర్ ఆవేదన**



హైదరాబాద్. డిసెంబర్ 5: బీసీ రిజర్వేషన్ల పేరిట సీఎం రేవంత్ రెడ్డి చేసిన దారుణమైన మోసానికి శ్రీసాయి ఈశ్వర్ అనే యువకుడి నిండు ప్రాణం బలైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీకి కాంగ్రెస్ సర్కారు తూట్లు పొడవడాన్ని తట్టుకోలేకే ఈశ్వర్ ఆత్మాహుతి చేసుకున్నాడని తెలిపారు.పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు కేవలం 17 శాతానికే కుదించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాలకు వెన్నుపోటు పొడిచారని కేటీఆర్ మండిపడ్డారు. ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యేనని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా సాయి ఈశ్వర్ మరణానికి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.కులగణనను మొదలుకుని న్యాయస్థానాల్లో నిలబడని జీవోల దాకా కాంగ్రెస్ ఏమాత్రం చిత్తశుద్ధి లేకుండా కామారెడ్డి డిక్లరేషన్ కు సమాధి కట్టిందని కేటీఆర్ అన్నారు. బాధితుడి కుటుంబానికి ప్రభుత్వం 50 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని డిఆమండ్ చేశారు.

## డొనాల్డ్ ట్రంప్‌నకు తొలి 'ఫిఫా శాంతి బహుమతి'



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఫిఫా శాంతి బహుమతి ప్రకటించింది. 2026లో జరగనున్న ఫిఫా ఫుట్‌బాల్ ప్రపంచకప్ పోటీలకు సంబంధించి వాషింగ్టన్ డీసీలోని కెన్నడీ సెంటర్‌లో డ్రా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచకప్ ట్రోఫీని ఆవిష్కరించారు. దీనికి ట్రంప్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు తొలి 'ఫిఫా శాంతి బహు మతి'ని ప్రకటిస్తున్నట్లు ఫిఫా అధ్యక్షుడు గియాని ఇన్‌ఫాంటినో పేర్కొన్నారు.



# పేదల అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## 20వేల కోట్ల రూపాయలతో ప్రతి గ్రామానికి రోడ్డు, తాగునీరు, పాఠశాలల అభివృద్ధి

**నర్సంపేటలో రూ. 532.24 కోట్ల పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన.**

**రాష్ట్రంలో ఎడ్యుకేషన్ ఇరిగేషన్ కమ్యూనికేషన్‌కు ప్రాధాన్యత ఇస్తూ తెలంగాణ రైసింగ్ సమ్మిట్ 2047 నిర్వహిస్తున్నాం.**

**ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి**

**వరంగల్/నర్సంపేట: (వాయిస్ టుడే) 05 డిసెంబర్ :** పేదల అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 'ప్రజా పాలన - ప్రజా విజయోత్సవాలు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ జిల్లాలోని నర్సంపేట లో హెలిపాడ్ కు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డిలు చేరుకోగా, రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ,దనసరి అనసూయ (సీతక్క), నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, ప్రభుత్వ విప్ రామ చంద్రునాయక్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం డి రియాజ్, ఎం పి బలరాం నాయక్, ఎమ్మెల్సీ లు బస్వరాజు సారయ్య , పింగిలి శ్రీపాల్ రెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, డాక్టర్ మురళి నాయక్, రేవూరి ప్రకాష్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, తదితరులు పుష్పగుచ్ఛాలు, పూల మొక్కలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శాలువాలతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నర్సంపేటలో రూ. 532.24 కోట్ల పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేశారు. అందులో రూ. 56.40 కోట్ల వ్యయంతో నర్సంపేట నుండి నెక్కొండ హెచ్ఎం రోడ్డు టూఎల్ పీఎస్ / నాలుగు లైన్ల రహదారికు రూ. 82.56 కోట్లతో హనుమకొండ - నర్సంపేట- మహబూబాబాద్ హెచ్ఎం రోడ్డు నాలుగు లైన్ల రోడ్డుకు నర్సంపేటలో రూ. 26 కోట్లతో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులకు, రూ.130 కోట్ల వ్యయంతో

- మిగతా 2వ పేజీలో



# కేసీఆర్ ఇకదూరమేనా

**హైదరాబాద్, డిసెంబర్ 5, (వాయిస్ టుడే):** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తిగా పార్టీని పక్కన పెట్టేసినట్లే కనపడుతుంది. ఇటీవల జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సమయంలోనూ ఆయన బయటకు రాలేదు. తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల విషయంలోనూ ఆయన ఎలాంటి అడుగు వేయలేదు. కనీసం మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నియోజకవర్గాల ఇన్ ఛార్జులను పిలిచి కూడా ఒక సమావేశాన్ని కూడా కేసీఆర్ ఏర్పాటు చేయలేదు. తెలంగాణలో స్థానిక ఎన్నికల సమరం ఈ నెల 11వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అయింది. అయినా కేసీఆర్ మాత్రం కనీసం ఎన్నికల విషయంలో ఎలాంటి జోక్యం చేసుకోకపోవడం ఇప్పుడు పార్టీలోనే చర్చనీయాంశంగా మారింది. ఇంకా కేసీఆర్ ఓటమి నుంచి తేరుకోలేకపోతున్నారా? అన్న అనుమానం కూడా కలుగుతుంది.ఇప్పటికే తెలంగాణలో ఎన్నికలు జరిగి దాదాపు రెండేళ్లు కావస్తుంది. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ దీక్షా దివస్ ను కూడా నిర్వహిస్తుంది. గ్రామస్థాయిలో సమరం ప్రారంభమయిన నేపథ్యంలో గులాబీ బాస్ మౌనం దేనికి సంకేతం అన్నది అర్థం కాకుండా ఉంది. పంచాయతీ ఎన్నికలు అంటే పార్టీ రహితంగా జరిగేవే కావచ్చు. పార్టీ గుర్తులు లేకపోయినప్పటికీ గ్రామాల్లో ఖచ్చితంగా ఆ యా పార్టీలకు సంబంధించిన వ్యక్తులే పోటీలో ఉంటారు. ఖచ్చితంగా పరోక్షంగా పార్టీ అభ్యర్థిగానే చూసి ప్రజలు ఓట్లు వేస్తారు. పంచాయతీ ఎన్నికలకు ఆయన ప్రచారం చేయకపోవచ్చు. కనీసం ప్రకటన కూడా కేసీఆర్ నుంచి రాకపోవడంపై బీఆర్ఎస్ శ్రేణులు నిరాశలో మునిగిపోయాయి.రాష్ట్రంలో అనేక సమస్యలు ఉన్నప్పటికీ వాటిపై స్పందించడానికి కూడా కేసీఆర్ బయటకు రావడం లేదు. మరొకవైపు కల్వకుంట్ల

- మిగతా 2వ పేజీలో



## గాంధీలో చికిత్స పొందుతూ సాయి ఈశ్వర్ చారి మృతి

**బీసీ సంఘాల ఆందోళన అరెస్ట్...**

**సాయి ఈశ్వర్ చారి కుటుంబానికి కోటి రూపాయల ఆర్థిక సాయం అందించాలి..**

సికింద్రాబాద్, డిసెంబర్ 05 (వాయిస్ టుడే ప్రతినిధి): క్యూ న్యూస్ కార్యాలయం ముందు పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకున్న సాయి ఈశ్వర్ చారి (35) గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. సాయి ఈశ్వర్ కు భార్య కవిత(30), కృత్తిక(6), సాయి దత్త(4), చిట్టి(1) ముగ్గురు పిల్లలు ఉన్నారు.

- మిగతా 2వ పేజీలో

## బీసీలపై కాంగ్రెస్ ప్రభుత్వ అన్యాయానికి తార్కాణం ఈశ్వర్ చారి ఆత్మహత్య ఘటన

**ఈ దారుణానికి కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలి**

**బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు డిమాండ్**



హైదరాబాద్, డిసెంబర్ 5: మేడిపల్లిలో బీసీ యువకుడు ఈశ్వర్ చారి ఆత్మహత్య ఘటనపై బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు స్పందించారు. బీసీలపై కాంగ్రెస్ ప్రభుత్వ అన్యాయానికి తార్కాణం ఈశ్వర్ చారి ఆత్మహత్య ఘటన అని విమర్శించారు. రాంచందర్ రావు.మేడ్చల్ -మల్కాజ్ గిరి జిల్లాలోని మేడిపల్లిలో శ్రీ సాయి ఈశ్వర్ చారి అనే బీసీ సామాజిక వర్గానికి చెందిన యువకుడు ఆత్మహత్యాయత్నం చేసి ప్రాణాలు కోల్పోయిన ఘటన తెలంగాణలోని సామాజిక న్యాయం పూర్తిగా కూలిపోయిందనడానికి పెద్ద నిదర్శనం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ హక్కులను అమలు చేయకపోవడం, ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యం- వివక్షలతో తీవ్ర నిరాశ, ఆవేదనకు గురై సాయి ఈశ్వర్ చారి ఆత్మహత్యాయత్నం చేశాడు. బీసీలను మోసం

2లో

# 100 కోట్ల అవినీతి



**హైదరాబాద్ డిసెంబర్ 5 (వాయిస్ టుడే):** పేద ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని యేళ్లుగా అవినీతికి అలవాటు పడిన మరో బడా తిమింగలం ఏసీబీ గాలంకి చిక్కింది. ఏకంగా రూ.100 కోట్లు కూడబెట్టడంతో అధికారులు కూడా షాకయ్యారు. అడ్డగోలుగా సంపాదించిన సొమ్ముతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటకలో భారీగా అక్రమాస్తులు కూడబెట్టాడు. రంగారెడ్డి జిల్లా సర్వే, సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ కే శ్రీనివాస్ అవినితి చిట్టా ఇది. ఏపీబీ అధికారులు పకడ్బందీగా కాపుకాసి గురువారం (డిసెంబర్ 4) ఆయన కార్యాలయం, ఇల్లు, బంధువులు, స్నేహితులు, బినామీల ఇళ్లతో సహా మొత్తం 7 చోట్ల ఏకకాలంలో జరిపిన ఆకస్మిక తనిఖీల్లో ఈ యవ్వారం బయటపడింది. ఈ క్రమంలో రంగారెడ్డి, నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాలో సోదాలు చేపట్టారు. తనిఖీల్లో బయటపడ్డ శ్రీనివాసులు అక్రమాస్తుల మార్కెట్ విలువ సుమారు రూ.100 కోట్లకు పైమాటేనని లెక్కతేల్చారు.రంగారెడ్డి జిల్లా ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు కార్యాలయంలో ఏసీబీ అధికారులు 10 గంటలపాటు సోదాలు చేశారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఏసీబీ అధికారులు దర్యాప్తు జరిపారు. ఏడీ శ్రీనివాసులు అవినీతి అక్రమాలకు పాల్పడుతూ రంగారెడ్డి జిల్లాలో విలువైన భూముల రికార్డులను తారుమారు చేసి కోట్ల రూపాయలు వెనకేసినట్లు ఆరోపణలు వచ్చాయి. మణికొండ,

- మిగతా 2వ పేజీలో

## యుక్త వయసు వచ్చిన ఇద్దరు వ్యక్తులు సహజీవనం చేయవచ్చు

(మొదటి పేజీ తరువాయి)

తమను చంపేస్తామని అమ్మాయి ఫ్యామిలీ బెదిరిస్తున్నట్లు ఆ జంట పిటీషన్‌లో పేర్కొన్నది. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదును ఎవరూ పట్టించుకోవడం లేదని కూడా ఆ జంట తమ పిటీషన్‌లో ఆరోపించింది. ఆ పిటీషన్‌ను వ్యతిరేకిస్తూ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వివేక్ చౌదరీ వాదించారు. అబ్బాయికి 21 ఏళ్లు నిండలేదని, ఇంకా అతనికి పెళ్లి వయసు రాలేదని కోర్టుకు తెలిపారు. సహజీవనం కొనసాగించేందుకు అతనికి పర్మిషన్ ఇవ్వవద్దు అని కోర్టుకు వెల్లడించారురు.కానీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనను కోర్టు కొట్టివేసింది. పెళ్లి వయసు రాలేదని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, స్వేచ్ఛా హక్కును హరించలేమని కోర్టు పేర్కొన్నది. భారతీయ చట్టాల ప్రకారం లివిన్ రిలేషన్‌ను నిషేధించలేమని, నేరంగా చూడలేమని కోర్టు చెప్పింది. పిటీషన్‌లో ఉన్న అంశాలను పరిశీలించాలని బిల్వారా, జోద్‌పూర్ పోలీసుల్ని జస్టిస్ ధండ్ ఆదేశించారు. యువ జంటకు రక్షణ కల్పించాలని కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది.

## భగవద్గీతను పుతిన్‌కు గిఫ్టుగా ఇచ్చిన ప్రధాని మోదీ!

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయి, దీనిని రష్యా తీవ్రవాద పుస్తకాల జాబితాలో చేర్చాలని ప్రతిపాదించింది.

**బహుమతిగా అదే భగవద్గీత, కానీ కథ పూర్తిగా మారింది**

ఇప్పుడు చరిత్ర మారింది. ప్రధాని మోదీ, పుతిన్ ఢిల్లీలో ముఖాముఖిగా కలిసినప్పుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రష్యన్ భాషలోకి ట్రాన్స్‌లేట్ అయిన భగవద్గీతను బహుమతిగా ఇచ్చారు. ఈ బహుమతి కేవలం ఒక పుస్తకం కాదు. గతంలోని నెలకొన్న అనుమానాలు తొలగిపోయాయని, రెండు దేశాలు మునుపటి కంటే బలమైన నమ్మకం పునాదిపై నిలబడ్డాయనే సందేశం ఇది. నేడు, భారతదేశం, రష్యా తమ సంబంధాన్ని కేవలం భాగస్వామ్యంగానే కాకుండా చారిత్రక స్నేహంగా చూస్తున్నాయి. ఆ స్నేహం సమయంలో గీత వంటి ఆధ్యాత్మిక గ్రంథం ఉండటం ద్వారా రెండు దేశాలు గత వివాదాలను మాత్రమే కాకుండా వాటిని కొత్త ప్రారంభానికి ఆధారంగా కూడా చేసుకున్నాయని తెలుస్తుంది.

## ఇండిగో పరిస్థితికి ప్రభుత్వ గుత్తాధిపత్యమే ప్రధాన కారణం : రాహుల్ గాంధీ

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. ఎప్పటిలాగే జాప్యాలు, రద్దులు, నిస్సహాయతకు మూల్యం చెల్లించేది సాధారణ పౌరులే అని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ‘ఇండిగో విమానాల రద్దు, అంతరాయాల కారణంగా దేశంలో విమానయాన రంగంలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఇండిగో వైఫల్యానికి ఈ ప్రభుత్వ గుత్తాధిపత్యమే ప్రధాన కారణం. ఎప్పటిలాగే జాప్యాలు, రద్దులు, నిస్సహాయతకు మూల్యం చెల్లించేది సాధారణ పౌరులే. ఇలాంటివి మరోసారి జరగకుండా ఉండేందుకు విమానయాన రంగంతో సహా అన్నింటిలోనూ న్యాయమైన పోటీ ఉండాలి. మ్యాచ్‌ఫిక్సింగ్, గుత్తాధిపత్యాలు కాదు’ అంటూ తన పోస్టులో రాసుకొచ్చారు. మరోవైపు ఈ పరిస్థితిపై పార్లమెంట్ సమావేశాల్లో చర్చ చేపట్టాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

## కేసీఆర్ ఇకదూరమేనా

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబలో చీలిక వచ్చింది. ఆయన కుమార్తె తెలంగాణ జాగృతి తరుపున రాష్ట్రంలో పాదయాత్ర చేపట్టారు. మరొకవైపు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా కేటీఆర్ తిరుగుతున్నారు. మరొకవైపు మేనల్లుడు మాజీ మంత్రి హరీశ్ రావు కూడా ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. కానీ గులాబీ బాస్ గా కేసీఆర్ కనీసం ఫామ్ హౌస్ నుంచిబయటకు రాకపోవడం, నియోజకవర్గాల్లో నేతలకు దిశానిర్దేశం చేయడానికి ఉత్సాహం చూపకపోవడంపై పార్టీలో చర్చ జరుగుతుంది. ఆయన మరికొంత కాలం బయటకు రారని పార్టీ ముఖ్య నేతలు చెబుతున్నప్పటికీ, కీలక సమయాల్లో రాకపోతే ఎలా? అన్న ప్రశ్న క్యాడర్ నుంచి వస్తుంది. మరి కేసీఆర్ ఇప్పటికైనా స్పందిస్తారా? లేదా? అన్నది చూడాలి.

## 100 కోట్ల అవినీతి

(మొదటి పేజీ తరువాయి)

నార్సింగి, వట్టినాగులపల్లితోపాటు పలు ప్రాంతాల్లో భూవివాదాల్లో భారీగా అక్రమాలకు పాల్పడినట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఇందులో భాగంగానే రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంతోపాటు రాయదుర్గంలోని మైహోమ్ భుజలో కూడా అధికారులు సోదాలు నిర్వహించారు. నల్లగొండ జిల్లాలో పని చేస్తున్నప్పుడు శ్రీనివాసులుపై చర్యలు తీసుకోవాలని ఆ జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక పంపితే.. పైఅధికారులు కుమ్మక్కై శిక్షించడానికి బదులు రంగారెడ్డి జిల్లా ఏడీగా మరో కీలక స్థానానికి బదిలీ చేశారు. అప్పట్నుంచి శ్రీనివాసులు మరింత రెచ్చిపోయి అందినకాడికి భారీగా కూడబెట్టుకున్నాడు. అంతేకాదు శ్రీనివాసులు పనిచేసిన ప్రతీచోట అతడిపై పెద్ద ఎత్తున ఆరోపణలు రాసాగాయి. దీంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు డీఎస్పీ సీహెచ్ బాలకృష్ణ నేతృత్వంలోని బృందం తనిఖీలు చేపట్టింది

# పేదల అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



(మొదటి పేజీ తరువాయి)



నిర్మించనున్న ప్రభుత్వ వైద్య కళాశాల మరియు వసతి గృహముల నిర్మాణ పనులకు, రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణ పనులకు, నర్సంపేట పట్టణంలో రూ. 20.కోట్లతో అంతర్గత సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, బీటీ రోడ్లు, సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులకు, రూ.17.28 కోట్ల వ్యయంతో నర్సంపేట నుండి పాకాల హెచ్ఏఎం రోడ్డు 2ఎల్ ంపీఎస్ లైన్ల పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. దీనితో నర్సంపేట కు విద్య, వైద్యం, రహదారి విస్తరణ వంటి ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగకరమైన రంగాలకు ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రాధాన్యత లభించింది. అనంతరం జరిగిన ప్రజా పాలన విజయోత్సవ వారోత్సవాల బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూరాష్ట్రంలో రూ.20 వేల కోట్ల రూపాయల తో ప్రతి గ్రామానికి రోడ్డు తాగునీరు, పాఠశాలను అభివృద్ధి చేస్తామని అన్నారు. రాష్ట్రంలో ఎడ్యుకేషన్ ఇరిగేషన్ కమ్యూనికేషన్ కు ప్రాధాన్యత ఇస్తూ ఈ నెల 8, 9 తేదీల్లో తెలంగాణ రైసింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో కోటి 10 లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని, రాష్ట్ర ప్రభుత్వం 3 కోట్ల 10 లక్షల మందికి సన్నబియ్యం ఇస్తోందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ప్రొఫెసర్ జయశంకర్‌ను స్ఫూర్తిగా తీసుకుని పేదల ఆకలి తీర్చాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సౌర విద్యుత్ పెట్రోలు బంక్ లు ఆర్ టి సి బస్సుల నిర్వహణ బాధ్యతను మహిళ సంఘాలకు అప్పగించినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఎన్నికల కోడ్ కారణంగా ఆగిపోయిన ఇందిరమ్మ చీరల పంపిణీ కోడ్ ముగిసిన వెంటనే 18 ఏళ్లు నిండిన ప్రతీ మహిళకు అందేలా స్వయంగా తానే బాధ్యత తీసుకుంటానని ప్రకటించారు. ఈ చీరలు గ్రామాల్లో మహిళలకు చేర్చే బాధ్యత మంత్రులు తీసుకోవాలని సూచించారు.వైఎస్ హయాంలో 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించి పేదవాళ్లకు ఇచ్చారని గుర్తు చేస్తూ%ా% పేదల ఆత్మ గౌరవాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్లను పేదలకు అందిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

వచ్చే ఆర్థిక సంవత్సరం లో నర్సంపేట నియోజకవర్గంలో మరో 3500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. 60 వేలకుపైగా ఉద్యోగాల భర్తీతో పాటు ఇచ్చిన హామీలను ఇప్పటికే అమలు చేశామని తెలిపారు. హైదరాబాద్‌లో ఉన్న సౌకర్యాలు, అభివృద్ధి అవకాశాలు వరంగల్‌కూ అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మార్చి 31 లోగా వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. అలాగే వరంగల్‌లో అండర్ డ్రైనేజ్ వ్యవస్థ, ఔటర్ రింగ్ రోడ్డును నిర్మించనున్నట్లు కూడా చెప్పారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మాంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా ఇచ్చిన హామీ మేరకు పేదవారి కోసం ముఖ్యమంత్రి గడిచిన 2 సం.లలో ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని అమలుచేస్తున్నారని అన్నారు. అభివృద్ధి లో రాష్ట్రాలతో కాకుండా అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడుతున్నామని అన్నారు.అప్పుల కుంపటిలో ఉన్న రాష్ట్రం లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నమని తెలిపారు. పేదవారి ఆత్మగౌరవానికి చిహ్నం ఇందిరమ్మ ఇళ్లు ప్రతి నియోజకవర్గానికి 3 వేల 500 ఇండ్లు మంజూరు చేశామని అన్నారు. రాబోయే 3 సం. లో పేదవారికి విడతల వారిగా ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని తెలిపారు.

స్థానిక శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి సుమారు 1000 కోట్ల నిధులు కేటాయించిన నర్సంపేట పై వరాల జల్లు కురిపించడం పై ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలిపిన శాసనసభ్యులు నియోజక వర్గానికి నాణ్యమైన విద్యను వైద్యాన్ని అందించడానికి రూ.200 కోట్ల వ్యయం తో ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్, తో పాటు రూ.154 కోట్ల తో మెడికల్ కళాశాల ను ఏర్పాటు చేయడం జరిగిందని కోట్లాది రూపాయలతో రోడ్ల విస్తరణ పనులు చేపడుతున్నామని తెలిపారు.

మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్ మాట్లాడుతూ ముఖ్య మంత్రి అనేక రకాల అటు పాట్లను ఎదుర్కొని ఈ స్థాయి కి చేరుకున్నారని ఇందిరమ్మ రాజ్య స్థాపనకు అహర్నిశలు కృషి చేస్తున్నారని, మరో 15 సం.లు ముఖ్యమంత్రి అధికారం లో ఉంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. బహిరంగ సభ ముగిసిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య మంత్రి సలహా దారు వేం నరేందర్ రెడ్డి లు హైదరాబాద్ కు హెలికాప్టర్ లో బయలు దేరి వెళ్ళేందుకు సాయంత్రం 5:25 లకు హెలిప్యాడ్ కు చేరుకోగా మంత్రులు ప్రజాప్రతినిధులు వీడ్కోలు పలికారు.

### గాంధీలో చికిత్స పొందుతూ

## సాయి ఈశ్వర్ చారి మృతి

(మొదటి పేజీ తరువాయి)

సంగారెడ్డి జిల్లా, పుల్కల్ మండలం,పోచారం విలేజ్‌కి చెందిన సాయి ఈశ్వర్ బ్రతుకుతెరువు కోసం నగరానికి వచ్చి తల్లి ప్రమీల, భార్య పిల్లలతో జగద్గిరిగుట్టలో నివాసం ఉంటు క్యాబ్ డ్రైవర్ గా పని చేస్తున్నాడు.



**గాంధీలో బీసీ సంఘాల ఆందోళన అరెస్ట్...**

సాయి ఈశ్వర్ చారి మృతి చెందిన వార్త తెలుసుకున్న బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి లతో పాటు వివిధ బీసీ సంఘాల వందలాది మంది నాయకులు పెద్ద ఎత్తున గాంధీ ఆసుపత్రికి చేరుకొని ఆందోళనకు దిగారు. ఈశ్వర్ మృతికి కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలే కారణం అంటూ నిందించారు. అడ్డుకున్న పోలీసులు జాజుల శ్రీనివాస్ గౌడ్, తీన్మార్ మల్లన్న, కుందారం గణేష్ చారి, బీసీ, సంఘాల నాయకులను అడ్డుకొని అరెస్టు చేసిన పోలీసులు వారిని చిలకలగూడ, తిరుమలగిరి,బొల్లారం, అంబర్ పేట,ఉప్పల్ పోలీస్ స్టేషన్ లకు తరలించారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి మాట్లాడుతూ...మృతి చెందిన సాయి ఈశ్వర్ చారి కుటుంబానికి కోటి రూపాయల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42% రిజర్వేషన్ల విషయంలో అన్యాయం చేసినందుకే సాయి ఈశ్వర్ ఆత్మహత్య చేసుకున్నాడంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన హత్య గానే భావిస్తున్నామన్నారు. ముఖ్యంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిలే ఈ హత్యకు బాధ్యత వహించాలన్నారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ నిరసనలు తెలపాలని పాలించారు. సాయి ఈశ్వర్ మృతి తో అయినా కేంద్రం, రాష్ట్రం దిగి రావాలన్నారు. మృతి పై పార్లమెంట్లో చర్చ జరగాలన్నారు. బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని ఈ పార్లమెంటు సమావేశాల్లో నే ఆమోదించాలన్నారు. తక్షణమే సర్పంచ్ ఎన్నికలు నిలిపివేసి, రిజర్వేషన్ తర్వాతే నిర్వహించాలన్నారు. బీసీ ద్రోహుల పార్టీలైన కాంగ్రెస్, బిజెపిల నాయకుల ఇండ్లను ముట్టడిస్తామన్నారు. కాంగ్రెస్ బిజెపిలలో ఉన్న బీసీ నేతలు తమ పదవులకు రాజీనామా చేయాలన్నారు. సాయి ఈశ్వర్ చారి మృతిపై అఖిలపక్ష పార్టీల వైఖరి ప్రకటించాలని కోరారు.

## బీసీలపై కాంగ్రెస్ ప్రభుత్వ అన్యాయానికి తార్కాణం ఈశ్వర్ చారి ఆత్మహత్య ఘటన

(మొదటి పేజీ తరువాయి)

చేస్తూ, వారి హక్కులను హరిస్తూ, అధికారంలోకి వచ్చి రెండేళ్లైనా ఒక్క వాగ్దానం కూడా నిలబెట్టుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వ వ్యవహారమే ఈ దారుణానికి కారణం. మృతుడు సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం పోచారం గ్రామానికి చెందినవాడు. జీవనోపాధి కోసం కుటుంబంతో కలిసి జీడిమెట్ల సమీపంలోని జగద్గిరిగుట్టలో నివసిస్తూ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు.బీసీలకు సరైన అవకాశాలు, 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని మాటలు చెప్పి తీరా ఆ హామీని నిలుపుకోకుండా మోసం చేశారు. బీసీలకు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించడం లేదు. బీసీ కార్పొరేషన్లకు నిధులు ఇవ్వలేదు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు.. గత కేసీఆర్ ప్రభుత్వం మాదిరిగానే బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తూ బీసీలను నయవంచకు గురిచేస్తోంది. ఈ వివక్షే ఒక యువకుడి మృతికి కారణమైంది. ఇది కేవలం ఒక కుటుంబం బాధ కాదు – ఇది బీసీల పట్ల ప్రభుత్వం చూపుతున్న వ్యవహార శైలికి ప్రతిబింబం. భారతీయ జనతా పార్టీ ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు.. ఈ దారుణానికి కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేసారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన అన్ని హామీలను వెంటనే అమలు చేయాలి. బీసీ కార్పొరేషన్లకు నిధులను వెంటనే విడుదల చేయాలి. బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలన్నింటిని క్లియర్ చేయాలి. బీసీల హక్కుల కోసం–తెలంగాణలో సామాజిక న్యాయం కోసం బిజెపి పోరాటం కొనసాగిస్తూనే ఉంటుంది. బీసీలకు కాంగ్రెస్ సర్కారు చేస్తున్న అన్యాయం, అహంకార పాలనకు ముగింపు పలికేది ప్రజలేనన్నారు.



# ఏకపక్షం అవుతున్న పంచాయితీ ఎన్నికలు

**ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తొలివిడత 20 గ్రామాల సర్పంచ్ లు ఏకగ్రీవం**

**3682 వార్డులో 1045 వార్డు సభ్యులు ఏకగ్రీవం**

**రెండు, మూడో విడతలో భారీగా ఏకగ్రీవం కానున్న పంచాయితీలు**

**ఏకగ్రీవమైన పంచాయితీలపై ప్రత్యేక దృష్టి పెట్టిన అధికారులు**

**ఉపసర్పంచ్ ని ఎన్నుకునే పనిలో నిమగ్నమైన ఏకగ్రీవమైన పంచాయితీలు**

**హైదరాబాద్:** తెలంగాణలో పంచాయతీ పోరు పీక్ స్టేజ్ కి చేరింది. నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో ఇక ఏకగ్రీవాలపై రాజకీయ పార్టీల నాయకులతో పాటు గ్రామ పెద్దలు ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రలోభాలకు, వేలం పాటలకు తావు లేకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టడంతో రహస్యమంతనాలు గ్రామ అభివృద్ధి పేరుతో ఇప్పటికే పలు గ్రామాల సర్పంచ్ పదవులు, వార్డులు ఏకగ్రీవమయ్యాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 1224 గ్రామ పంచాయితీలు ఉండగా తొలి విడత పోలింగ్ జరిగే 398 గ్రామాల్లో సర్పంచ్, వార్డులకు ఒక్కొక్క నామినేషన్ వచ్చిన 20 గ్రామాల సర్పంచ్ లు, 1045 వార్డులు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. తొలి విడతలో 8 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ తోపాటు వార్డులన్ని ఏకగ్రీవం కావడంతో అక్కడ ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

అత్యధికంగా రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలంలో ఏడు గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. కోనరావుపేట మండలంలో రెండు పంచాయితీల సర్పంచులు వార్డు సభ్యులు ఏకగ్రీవం అయ్యారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం దేశాయిపేట పంచాయతీ మొత్తం, పెద్దకుర్మపల్లి సర్పంచ్ తో పాటు కొన్ని వార్డులు రామడుగు మండలం శ్రీరాములపల్లి సర్పంచ్ ఏకగ్రీవం అయింది. పెద్దపల్లి జిల్లాలోని మంథని మండలం తోటగోపయ్యపల్లి సర్పంచ్ తోపాటు అన్ని వార్డులు, మైదుపల్లి, నాగారం, రామగిరి మండలం చందనాపూర్ లో సర్పంచ్ లు ఏకగ్రీవం అయ్యారు. జగిత్యాల జిల్లాలో ఇబ్రహీంపట్నం మండలం మూలరాంపూర్, యామపూర్ కథలాపూర్ మండలం రాజారాంతండా మెట్పల్లి మండలం చింతలపేట్ పంచాయతీల సర్పంచ్ లు ఏకగ్రీవమయ్యాయి.ఏకగ్రీవమైన సర్పంచులు వార్డు సభ్యులు సంబరాల్లో మునిగితేలుతున్నారు. కొందరికి రిజర్వేషన్ కలిసొంచి ఏకగ్రీవం కాక, మరికొందరు గ్రామంలో సొంత డబ్బులతో గుడి తోపాటు పలు అభివృద్ధి పనులు చేస్తామని ఏకగ్రీవమయ్యారు. గ్రామ అభివృద్ధి కాంక్షిస్తూ గ్రామస్తులంతా ఐక్యంగా సర్పంచ్ ని పలు వార్డులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందంటున్నారు.

## మళ్లీ ఉగ్రవాద దాడులు.. దేశం లో హైఅలర్ట్

న్యూఢిల్లీ, డిసెంబర్ 5, (వాయిస్ టుడే): దేశంలో ఉగ్ర కార్యకలాపాలు చాపకింద నీరులా పెరుగుతున్నాయి. వేర్వేరు ఘటనలు వరుసగా బయటపడుతున్నాయి. అయితే అన్ని ఘటనలకూ ఒకే లింక్ ఉన్నట్లు తెలుస్తోంది. డిసెంబర్ 6 లేదా జనవరి 26 తేదీలను లక్ష్యంగా ఉగ్రవాద విజృంభణలు సాగుతున్నట్లు తెలుస్తోంది. బెంగాల్ నుంచి గుజరాత్ వరకు, ఢిలీ, కశ్మీర్, ఫరీదాబాద్, రాజస్థాన్ వంటి ప్రాంతాలలో పేలుళ్ల కోసం ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఉగ్రవాద కార్యకర్తలు విడివిడిగా ఉన్నా, ఉత్తర భారతదేశంలో భారీ అగ్ని సృష్టించేందుకు సన్నాహకాలు చేస్తున్నారని అనుమానాలు ఉన్నాయి.అల్ ఫలా యూనివర్సిటీ పరిధిలో ఉగ్ర డాక్టర్లు ఇస్తున్న సమాచారంతో ఇంటలిజెన్స్, పోలీసులు, భద్రతాదళాలు ఉగ్ర లింకులు, ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నవారి కోసం వెతుకుతున్నారు. సారంపూర్‌లో జైష్ ఎ మహ్మద్ మహిళా విభాగాన్ని నిర్వహించే ఉగ్ర మహిళా డాక్టర్ పట్టుబడింది. నూహూ ప్రాంతంలో ఉగ్రులకు అవాంతరం కల్పించేవారు అడ్వకేట్లు, చార్టర్డ్ అకౌంటెంట్లు, మత బోధకులు కూడా ఉన్నారు.గుజరాత్‌లో రిసిన్ అనే విష పదార్థాలను ఆహార, ప్రసాదాలపై కలిపే ప్రయత్నం జరిగింది. రాజస్థాన్‌లో నంబర్ ప్లేట్ లేకుండా అనుమానాస్పదంగా పట్టుకున్న వాహనంలో 981 జిలిటెన్ స్టిక్స్, 93 డిటోనేటర్స్, పీజ్ వైర్లు, టైమర్లు కనుగొన్నారు. అల్ ఫలా యూనివర్సిటీ పరిధిలో 2,900 కిలోల పేలుడు పదార్థాలు దొరికాయి.

# కేసీఆర్ పోరాటం నేటి తరం విద్యార్థులకు తెలియజేయాలి

**ప్రతీ ఏడాది 11 రోజుల పాటు దీక్షా దివస్ కార్యక్రమాలు**

**ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్**

**యువతకు ఆదర్శం కేసీఆర్ స్వరాష్ట్ర పోరాటం**

**ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు**



హనుమకొండ, వాయిస్ టుడే: ఉద్యమ నేత,స్వరాష్ట్ర సాధకుడు,తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యమ చరిత్ర,త్యాగాలు,ఉద్యమ కారుల పోరాటాన్ని నేటి తరానికి,విద్యార్థులకు,రానున్న తరానికి తెలియజేయాలన్న ఆశయంతోనే దీక్షా దివస్ కార్యక్రమాన్ని 11 రోజుల పాటు నిర్వహిస్తున్నామని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్,మాజీ శాసనసభ్యులు,బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. దీక్షా దివస్ లో భాగంగా శుక్రవారం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్,ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు హాజరు అయ్యారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల పోరాటం మరువలేనిదన్నారు. తెలంగాణ యువత,విద్యార్థులు స్వరాష్ట్రాన్ని సాధించేందుకు ప్రాణాలను సైతం అర్పించారని తెలిపారు. వారి ప్రాణ త్యాగాలే నేటి స్వరాష్ట్రం అని పేర్కొన్నారు. విద్యార్థులు కేసీఆర్ తెలంగాణ ప్రత్యేక ఉద్యమానికి అండగా నిలిచారని తెలిపారు. బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నేటి విద్యార్థులకు కేసీఆర్ పోరాటం,ఉద్యమ నేపథ్యం,తెలంగాణ అభివృద్ధిని తెలిపేందుకు వ్యాస రచన పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. 2009 నవంబర్ 29న కేసీఆర్ తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్షకు దిగారని,నాటి పోరాట దీక్షను స్ఫూర్తిగా తీసుకొని ప్రతీ ఏడాది 11 రోజుల పాటు దీక్షా దివస్ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందని వినయ్ భాస్కర్ తెలియజేశారు.

అనంతరం ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు మాట్లాడుతూ నేటి తరానికి తెలంగాణ ప్రాంతం చరిత్ర, వెనుకబాటు,60 ఏండ్ల అణచివేత, 14 ఏండ్ల కేసీఆర్ స్వరాష్ట్ర పోరాటం,10 ఏండ్ల బీఆర్ఎస్ పాలన, సంక్షేమం, అభివృద్ధిని వివరించాల్సిన అవసరం ఉందన్నారు. కేసీఆర్ స్వరాష్ట్ర తెలంగాణ ఉద్యమ చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా 11 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి తెలంగాణను సాధించారని అన్నారు. తెలంగాణ ఎవరో ఇస్తే వచ్చింది కాదని..కేసీఆర్,తెలంగాణ సమాజం ఉద్యమం, సకల జనుల పోరాటం వలనే తెలంగాణ వచ్చిందన్నారు. కేసీఆర్ 14 ఏండ్లు తెలంగాణ కోసం అలుపెరగని పోరాటం,10 ఏండ్లు తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపారని అన్నారు. నాటి నీళ్లు,నిధులు,నియామకాలు లక్ష్యంతో స్వరాష్ట్రంలో నీళ్లు తెచ్చామని,మన నిధులు మనకు దక్కుతున్నాయని,మన బిడ్డలకు నియామకాలు వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షులు బైరపాక ప్రశాంత్,కేయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ కత్తెరపెల్లి దామోదర్,బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల శరత్ చంద్ర,హనుమకొండ జిల్లా కో ఆర్డినేటర్ గంద్రకోట రాకేష్ యాదవ్,బీఆర్ఎస్వీ విద్యార్థి నాయకులు గొల్లపెల్లి వీరస్వామి,పస్తం అనిల్ కుమార్,కోరపెల్లి రాజేష్,రాసూరి రాజేష్, స్నేహిత్,భార్గవ్,పవన్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## చదువు తో పాటు ఆటలోనూ రాణించాలి
## క్రీడలతో శారీరక, మానసిక అభివృద్ధి

**ప్రణాళిక ప్రకారం చదివి లక్ష్యం చేరుకోవాలి.ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్.**

**కేంద్రీయ విద్యాలయం వార్షిక ఆటల పోటీలు ప్రారంభం.**

**అలరించిన విద్యార్థుల నృత్యాలు, ప్రదర్శనలు**



రాజన్న సిరిసిల్ల జిల్లాబీ డిసెంబర్ 05: విద్యార్థులు చదువు తో పాటు ఆటలోనూ రాణించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు ఇచ్చారు. కేంద్రీయ విద్యాలయం వార్షిక ఆటల పోటీలు 2025-26కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరు కాగా, స్కౌట్స్ అండ్ గైడ్స్ స్వాగతం పలికారు. ఆటల పోటీల జెండాను ఆవిష్కరించి, ప్రారంభించారు. విద్యార్థుల నృత్యాలు, ప్రదర్శనలు అలరించాయి. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ప్రణాళిక ప్రకారం చదివి లక్ష్యం చేరుకోవాలని పిలుపు ఇచ్చారు. విద్యార్థులు ఆన్లైన్ గేమ్స్ ఆడవద్దని, ప్రతి రోజు గంట పాటు ఆటలు ఆడాలని సూచించారు. క్రీడలు, యోగా సాధనతో శారీరక, మానసిక సమతుల్యత, అభివృద్ధి సాధ్యమని వివరించారు. తరగతి గది పుస్తకాలతోపాటు లైబ్రరీ లోని ఇష్టమైన పుస్తకాలు, దిన పత్రికలు చదవాలని పేర్కొన్నారు. వివిధ అంశాలపై అవగాహన వస్తుందని వివరించారు. గత ప్రశ్నాపత్రాలు, మోడల్ పేపర్లు ప్రాక్టీస్ చేయాలని సూచించారు. దీంతో వార్షిక, పోటీ పరీక్షల్లో విజయం సాధించడం సులువు అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ శేషా ప్రసాద్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలించిన అదనపు కలెక్టర్

**మూడో ఫేజ్ నామినేషన్ కేంద్రాల పరిశీలన**

రాజన్న సిరిసిల్ల జిల్లాబీ డిసెంబర్ 05: రాజన్న సిరిసిల్లజిల్లా వేములవాడ అర్బన్ మండలంలోని నాంపల్లి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీ ఏసీ ఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం నిలువలు చూసి, అక్కడ ఉన్న రైతులతో మాట్లాడారు. రైతుల వివరాలు ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ వేగంగా పూర్తి చేసి ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు.

**నామినేషన్ల పరిశీలన :** ఎల్లారెడ్డి పేట మండలంలోని పలు నామినేషన్ కేంద్రాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పరిశీలించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మూడో ఫేజ్ లో భాగంగా ఎల్లారెడ్డి పేట, హరి దాస్ నగర్, వెంకటా పూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను అదనపు కలెక్టర్ పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు.పరిశీలనలో వేములవాడ, ఎల్లారెడ్డి పేట తహసీల్దార్లు విజయ ప్రకాశ్ రావు, సుజాత తదితరులు ఉన్నారు.

# బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ

**సాయి ఈశ్వరా చారిని బలి తీసుకుంది కాంగ్రెస్ పార్టీయే**

**ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్**

**సాయి ఈశ్వరా చారి మృతికి సంతాపంగా ర్యాలీ**

**కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టి బొమ్మని దహనం**



హనుమకొండ, వాయిస్ టుడే: కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలతో పాటు బీసీలను మోసం చేస్తున్నదని మాజీ ఛీఫ్ విప్,హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ ల కోసం మనస్థాపం చెంది గురువారం హైదరాబాద్ లో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్న సాయి ఈశ్వరా చారి మరణించిన నేపథ్యంలో వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో హనుమకొండ లోని బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ నుండి అదాలత్ వరకు బీఆర్ఎస్ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ 420 హామీలు,6 గ్యారంటీల పేరుతో తెలంగాణ ప్రజలను మోసం చేసి అధికారం లోకి వచ్చిందన్నారు. బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామన్నా కాంగ్రెస్ స్థానిక ఎన్నికల్లో 17 శాతానికి తగ్గించడం తట్టుకోలేక సాయి ఈశ్వరా చారి ఆత్మహత్య చేసుకున్నాడాని మండిపడ్డారు. సాయి ఈశ్వరా చారి మరణం కాంగ్రెస్ హత్యేనని.. బీసీ రిజర్వేషన్ ల విషయంలో కాంగ్రెస్ ఆర్డినెన్స్ పేరిట,జీవో ల పేరిట,బిల్లుల పేరిటధర్నాల పేరుతో కాంగ్రెస్ డ్రామాలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. సాయి ఈశ్వరా చారి మరణం ఊరికే పోదని.. దశల వారీగా ఆందోళనలు చేస్తామని వినయ్ భాస్కర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తుల తో నివాళులు అర్పించిన బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వం దిష్టి బొమ్మని దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్,నాయకులు సంకు నర్సింగరావు,సాంబారి సమ్మారావు,జోరిక రమేష్,దువ్వ కనకరాజు,బరిగెల వినయ్ తదితరులు పాల్గొన్నారు.



## ఉనికిచర్ల గీతా కార్మిక సొసైటీ నూతన కమిటీ ఎన్నిక

కాజీపేట, వాయిస్ టుడే: ఉనికిచర్ల గ్రామ గీతా కార్మిక సొసైటీ కమిటీ ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సొసైటీ అధ్యక్షులుగా కోటగిరి రాజు గౌడ్,ఉపాధ్యక్షులుగా నాతి శాంతి కుమార్ గౌడ్,కార్యదర్శిగా కోటగిరి శ్రీనివాస్ గౌడ్,కోశాధికారిగా ఆరేలి రవీందర్ గౌడ్,గౌరవ సలహాదారులుగా తాళ్లపల్లి సతీష్ కుమార్ గౌడ్,బుర్ర రాజేష్ గౌడ్, కార్యవర్గ సభ్యులుగా కోటగిరి శివా గౌడ్,నాతి కుమారస్వామి గౌడ్ ,ఆరెల్లి చిరంజీవి గౌడ్,నాతి నవీన్ గౌడ్,ఆరేల్లి సాంబరాజు గౌడ్,సట్ల రవీందర్ గౌడ్,ఆరేల్లి రాజు గౌడ్ లను గీతా కార్మికులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ గీతా కార్మిక సొసైటీ అభివృద్ధికి గీతా కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ గీత కార్మికులు పాల్గొన్నారు.



## మాటేడు దేవాలయాలను సందర్శించిన సాఫ్ట్ వేర్ కంపెనీ సీఈఓ

తొర్రూరు, డిసెంబర్ 5 వాయిస్ టుడే : తొర్రూరు మండలం మాటేడు గ్రామంలోని దేవాలయాలు శ్రీ పార్వతీ శంభులింగేశ్వర స్వామి, శ్రీ రాధా వేణుగోపాల స్వామి వారి దేవాలయాలను శుక్రవారం ప్రముఖ సాఫ్ట్ వేర్ కంపెనీ స్టార్టాప్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ సుధీర్ నంబియార్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఒకసారి ఈ దేవాలయాల గురించి విన్నప్పుడు ఒక్కసారి ఇక్కడికి రావాలని సంకల్పం తీసుకుని శుక్రవారం రావడం జరిగిందని , పురాతనమైన అతి ప్రాచీనమైన ఈ దేవాలయాలను చూస్తుంటే కాకతీయుల కళావైభవాలు కన్నులు కట్టినట్లు కనబడుతున్నాయని వ్యాఖ్యానించారు. రాను రాను దేవాలయాలు శిథిలావస్థకు చేరుకుని చరిత్ర కనుమరుగవడం బాధగా ఉందని తన వంతుగా దేవాలయం చుట్టూ ప్రత్యేకమైన బండలను ఏర్పాటు చేయాలని తలంపుతో సుమారు ఐదు లక్షల రూపాయల వరకు తను విరాళ రూపంగా అందిస్తున్నట్టుగా తెలిపారు. ఆయన వెంట కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సందెల అరవింద్ మాట్లాడుతూ తన సొంత గ్రామంకు ఇలా విచ్చేసి దేవాలయానికి తమ వంతుగా సహకారాన్ని అందిస్తున్నామని తెలిపారు. వీరితో పాటుగా గ్రామ మాజీ సర్పంచ్ సుంకరనేని పినాకపాణి, లేగల వెంకటరెడ్డి, అర్చకులు దేవయ్య , శ్రీనివాస శర్మ, కళ్యాణ్ పాల్గొని దేవాలయానికి ఆర్థికంగా సహకరించిన సుధీర్, అరవింద్ లకు కృతజ్ఞతలు తెలిపారు.



## సేవాకార్యక్రమాలకు చేయూతనందించాలి

తొర్రూరు, డిసెంబర్ 5 వాయిస్ టుడే : సేవా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ చేతనందించాలని లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు అధ్యక్షుడు డాక్టర్ సూర్నం రామ నరసయ్య అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం మొగుళ్ళ రవీంద్రనాథ్ జన్మదిన సందర్భంగా ప్రభుత్వ హాస్పిటల్ లో అన్న ప్రసాద వితరణ, ప్రోటీన్స్ పౌడర్ లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రామ నర్సయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలకు అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో కూల్ గ్యాట్ డాక్టర్ పి.కిరణ్ కుమార్, డాక్టర్ నందనా దేవి, డాక్టర్ మీరాజ్,క్లబ్ సెక్రటరీ మూడుపు రవీందర్ రెడ్డి, ట్రెజరర్ వజీనపల్లి శ్రీనివాస్,జాయింట్ సెక్రెటరీ బోనగిరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాములను తనిఖీ చేసిన కలెక్టర్ స్నేహ శబరిష్

**పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు,అధికారులు**



హనుమకొండ, వాయిస్ టుడే: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని జిల్లా వేర్ హౌజ్ గోదాములలో భద్రపర్చిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల (ఈవీఎంల) ను జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదనవు కలెక్టర్ వెంకట్ రెడ్డి తో కలసి శుక్రవారం అధికారులు,గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డు లోని జిల్లాకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్ లలో భద్రపర్చిన ఈవీఎంలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు,కట్టుదిట్టమైన భద్రత చర్యలు,సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించిన వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో ఆర్డీఓ రాథోడ్ రమేష్,ఎన్నికల పర్యవేక్షకులు జగత్ సింగ్,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ.వి శ్రీనివాస్,శ్యామ్ సుందర్,రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీకి రాజీనామా బిజెపిలో చేరిక

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) డిసెంబర్ 05: సోను మండల్ సోను విలేజ్ సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలోసోన్ మండలంలోనీ అక్కపూరం శ్రీనివాస్(దాసరి)సొండి గంగయ్య కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సమక్షంలో బీజేపీ పార్టీ లో చేరారు.వారికీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిచ్చారు.స్థానిక ఎన్నికల్లో సత్తా చాటి కాసాయా జెండా ఎగరావేయాలని నాయకులు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఏలేటి మహేశ్వర్ రెడ్డి బిజెపి సీనియర్ నాయకులు రావుల రామనాథ్ సోన్ మండల నాయకులు నరేష్ హైమత్ అమృత్ పోశెట్టి వెంకటేష్ సంతోష్ పాల్గొన్నారు.




## ఆరట్టునిర్వహణకు అనుమతి ఇవ్వాలి

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) డిసెంబర్ 05: నిర్మల్ లో ఈనెల 6 నిర్వహించే అయ్యప్ప నగర సంకీర్తనకు అనుమతి ఇవ్వాలని ఏ ఎస్ పి ఉపేందర్ రెడ్డికి అయ్యప్ప స్వాములు వినతి పత్రం అందజేశారు అత్యంత భక్తి శ్రద్ధ మధ్య జిల్లా కేంద్రంలో హరిహర క్షేత్రంలో ఆరట్టు నిర్వహించుకోవడం ఆనవాయుతికి వస్తుందన్నారు ఈ కార్యక్రమంలో గురుస్వామి మూర్తి కోశాధికారిగా వేణుగోపాల్ రెడ్డి రమేష్ గంగాధర్ పాల్గొన్నారు




## సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్

రామకృష్ణాపూర్, డిసెంబర్ 5(వాయిస్ టుడే): రామకృష్ణాపూర్ పట్టణంలోని సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో సైన్స్ వీక్ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు వివిధ ఇన్నోవేటివ్ ప్రాజెక్టులు, పర్యావరణ పరిరక్షణ, సాంకేతిక పరిజ్ఞానంపై వంటి విభాగాల్లో విద్యార్థులు వారి ప్రతిభను ప్రదర్శించారు. ప్రిన్సిపల్ పొన్నాల సుమన్, డైరెక్టర్ పొన్నాల వినయ్ విద్యార్థుల సృజనాత్మకతను పరిశీలించి ప్రశంసించారు. సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించేందుకు ఈ ఎగ్జిబిషన్‌ను నిర్వహించినట్లు ప్రిన్సిపల్ సుమన్ తెలిపారు.



## ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలి

రాజన్న సిరిసిల్ల జిల్లాబీ డిసెంబర్ 05: రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత అధ్యక్షతన ఎన్సిడి కార్యక్రమం పై స్టేట్ కన్సల్టెంట్ డాక్టర్.సత్యేంద్రనాథ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఇన్సిడి స్టాఫ్ నర్స్ లకు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఎంఎల్ హెచ్పి లకు (మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్) ఎన్సిడి కార్యక్రమం (డయభేటీస్, రక్తపోటు, గుండె సంబందించిన వ్యాధులు) పై సమీక్షించి ఆన్లైన్ డేటాలో ఆధార్ లింకుతో ఆన్లైన్లో అభా కార్డు జనరేట్ ఈ కార్యక్రమంలో నమోదు చేసి చికిత్స అందించారు. గ్రామం లోని ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని, సకాలంలో లక్ష్యాలు సాధించాలని, ఎన్సిడి డేటా కార్యక్రమం సంబంధించిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ అనిత, డాక్టర్ నయీమా, డిడియం కార్తీక్ పాల్గొన్నారు.

## వ్యవసాయ మంత్రిని కలిసిన డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లా (వాయిస్ టుడే న్యూస్) డిసెంబర్ 05: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ ను కలిసి నూతనంగా డిసిసి అధ్యక్షులుగా అయినందుకు కృతజ్ఞతలు తెలిపిన రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, తరువాత సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ను కలిసి జిల్లా ప్రజా సమస్యలపై వారికి తెలియజేశారు. నూతన డిసిసి అధ్యక్షులు అయినందుకు శాలువా తో మంత్రి సత్కరించారు. సంగీతం శ్రీనివాస్ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుంది

**వచ్చే ఎన్నికల నాటికి ప్రతి డివిజన్ అభివృద్ధి**

**ఒక్క చుక్క నీరు నిలవకుండా ప్రత్యేక కార్యాచరణ**

**1000 కోట్లతో మొదటి దశ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు త్వరలో శంకుస్థాపన**

**4.26 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాయిని శంకుస్థాపన**



హనుమకొండ, వాయిస్ టుడే: ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని 54,6వ డివిజన్ లలో 4.26 కోట్ల రూపాయలతో మంచి నీటీ పైప్ లైన్,సీసీ డ్రైన్,సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఒకే రోజు సుమారుగా 4కోట్ల పై చిలుకు నిధులతో ఆయా డివిజన్ లలో పనులు చేపట్టడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆయా డివిజన్ లో పలు కాలనీలో నేరుగా పర్యటిస్తూ పలు సమస్యలు నేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందని అన్నారు. 54,6వ డివిజన్ లు సొంత డివిజన్లు అని,రెండు డివిజన్ లలో ప్రత్యేక దృష్టితో నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులను చేస్తున్నామని తెలిపారు. రానున్న అతికొద్ది రోజుల్లోనే 1000 కోట్ల రూపాయలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించనున్నారని తెలిపారు. ఆనాడు పీసీసీ హోదాలో హనుమకొండ నగరానికి వచ్చిన రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలలో అన్నింటినీ నెరవేర్చే దిశగా పనులు చేపట్టారని అన్నారు. పోచమ్మకుంట శ్మశాన వాటిక మౌలిక సదుపాయాలు అభివృద్ధి కొరకు ప్రత్యేక దృష్టితో కిరాయి ఇండ్లలో ఉన్న కుటుంబాలకు మరణం భారం కాకూడదని ప్రత్యేక గదులను ఏర్పాటుచేయడం కోసం శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు,కాలనీ ప్రజలు మరియు అధికారులు పాల్గొన్నారు.



## రైతులు తప్పకుండా భూసార పరీక్షలు చేయించుకోవాలి

### గుజ్జులపల్లిలో ప్రపంచ నేల దినోత్సవ వేడుకలు

సైదాపూర్ (వాయిస్ టుడే):రైతులు తప్పకుండా సార పరీక్షలు చేయించుకొవాలని, సేంద్రియ ఎరువుల వాడకంతో అధిక దిగుబడి సాధించవచ్చని రామారావు తెలిపారు.ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం గుజ్జులపల్లె గ్రామ రైతులకు,స్కూల్ పిల్లలకు అవగాహన కల్పించడం జరిగింది.డబ్ల్యూ డబ్ల్యూ ఎఫ్ –ఇండియా (బీసీఐ),ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో గుజ్జుల పల్లె గ్రామంలో కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రామారావు మాట్లాడుతూ నేల ఆరోగ్యం పెంచుకోనుటకు నేలలో సేంద్రియ ఎరువులు,పచ్చి రొట్టె ఎరువులు,మిక్స్ క్రాప్స్ ,వర్మీ కంపోస్ట్,పశువుల గొర్ల మందలు పెట్టుకోవాలన్నారు.తద్వారా నేల యొక్క ఆరోగ్య స్థితి మెరుగు పడుతుందని,మెరుగుపడి నేలలో నీటిని నిలుపుకునే శక్తి పెరుగుతుందని రైతులు తప్పనిసరిగా ప్రతి మూడు పంటలకు ఒకసారి లేదా కనీసం రెండు సంవత్సరాలకు ఒకసారి భూసార పరీక్షలు చేసుకొని వచ్చిన ఫలితాల ఆధారంగా సూచించిన మోతాదులలోనే సేంద్రియ,రసాయన ఎరువులు వేసుకొని పంటలు పండించుకోవాలని తెలపారు.నేల కోతను అరికట్టుటకు వాళ్లకు అడ్డంగా దున్నుకోవాలని గట్ల వెంబడి మొక్కలు నాటుకోవాలని తెలపడం జరిగింది.అత్యంత విషపూరితమైన రసాయనే ఎరువులు పురుగుమందులను నిషేధించి సాంప్రదాయ భౌతిక యాంత్రిక జీవన ఎరువులను వాడుకోవాలని జీవవైవిద్యాన్ని పెంపొందించి పర్యావరణాన్ని కాపాడాలని తెల్పడం జరిగింది.రైతులు కూడా నేల ఆరోగ్యం కాపాడుటకు సేంద్రియ ఎరువులను వాడుతామని రాబోయే తరాలకు మంచి ఆరోగ్యమైన నేలను అందిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో రామారావు,మమత, రజిత ,సోనీ,తిరుపతి, రాజులు,స్కూల్ హెడ్మాస్టర్ టీచర్స్ విద్యార్థులు,గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకలు



బోయిన పల్లి, (వాయిస్ టుడే న్యూస్) డిసెంబర్ 05 : రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం వరదవల్లి లో దత్తాత్రేయ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఇతర ముఖ్య నేతలు. మిడ్ మానేరు లో స్పీడ్ బోట్ లో ప్రయాణం చేసి దత్తాత్రేయ స్వామి వారి ఆలయానికి చేరుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌బీ దత్తాత్రేయ స్వామి జయంతి సందర్భంగా రాష్ట్రం మంచి వర్షాలతో ప్రజలంతా అందరూ ఆయు ఆరోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకుంటున్నా, మిడ్ మానేరు ప్రాజెక్ట్ రావడం వల్ల దత్తాత్రేయ స్వామి ఆలయం చుట్టూ నీరు వచ్చాయి. దత్తాత్రేయ జయంతి రోజు దర్శనం కోసం వచ్చే భక్తులకు బోట్లు ఏర్పాటు చేయడం జరిగింది. కేవలం జయంతి రోజు మాత్రమే కాకుండా శాశ్వతంగా బోటు ఏర్పాటు చేసేలా ఇరిగేషన్ వద్ద ఫైల్ పెండింగ్ లో ఉంది. దత్తాత్రేయ స్వామి ఆశీర్వచనం అందరి పైన ఉండాలని స్వామివారిని వేడుకున్న అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండు సంవత్సరాల ప్రజా పాలన ప్రభుత్వం లో అనేక సంక్షేమ పథకాలు సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నాం అన్నారు.

## సందెపురాళ్ల పోటీల్లో విజేతలకు బహుమతుల పంపిణీ



మక్తల్ డిసెంబర్ 05 వాయిస్ టుడే ప్రతినిధి: మక్తల్ పట్టణంలోని పడమటి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం రోజు ఉత్సవాల్లో భాగంగా సందెపురాళ్ల పోటీల నిర్వహించగా.. విజేతలకు ఆలయ ధర్మకర్త ప్రాణేశ చారి, ఈవో కవిత చేతులమీదుగా దాత కీర్తిశేషులు ఆడెం లక్ష్మన్న రిటైర్డ్ టీచర్ కుమారుడు ఆడం గోపి బహుమతులను అందించారు. మొదటి బహుమతి కింద కర్నాటక నాగర్ దొడ్డి గ్రామానికి చెందిన ప్రతాప్ కు 10 తులాల వెండి, రెండో బహుమతి కింద గుడె బల్లూర్ గ్రామానికి చెందిన సూరికి ఆరు తులాల వెండి, మూడో బహుమతి కింద పంచదేవ్ పాడ్ గ్రామానికి చెందిన నగేశ్ కు మూడు తులాల వెండి కడియాలను అందించారు. ఇటు లయన్స్ క్లబ్ మక్తల్, రెడ్ క్రాస్ సభ్యులు డాక్టర్ శ్రీరామ్ సైతం మొదటి బహుమతి కింద ప్రతాప్ కు 10 తులాల వెండి ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు అరవిందాచారి, ఆనంద తీర్థ చారి, విష్ణు తీర్థ చారి, సిబ్బంది శ్రీనివాస్, రవీందర్ గారు ,రమేష్ గారు, గోపాల్ గారు ,భక్తులు తదితరులు పాల్గొన్నారు.





# వైభవంగా పల్లకి సేవ పల్లకి సేవ

## ఆకట్టుకున్న నృత్యాలు..

## స్వాగతం పలికిన మహిళ భక్తులు

సంగారెడ్డి జిల్లా ఝరాసంగం (వాయిస్ టుడే) డిసెంబర్ 05: ఝరా సంగం మండలంలోని బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమం లో శుక్రవారం ఉదయం దత్తాత్రేయ స్వామివారి పల్లకి సేవ భక్తిశ్రద్ధలతో కొనసాగింది. ఉదయం 11:20 నిమిషాలకు ప్రారంభమైన పల్లకి సేవ మధ్యాహ్నం 3 గంటల వరకు శోభాయాత్ర కొనసాగింది. బర్దిపూర్, పరిసరాల కు చెందిన మహిళా భక్తులు నిండు కలశములతో పల్లకి సేవకు స్వాగతం పలికారు. పల్లకి సేవకు దత్తాత్రేయ స్వామి వారికి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భజన సంకీర్తనలు,మంగళ వాయిద్యాల మధ్య సాగిన పల్లకి సేవ కార్యక్రమంలో కర్ణాటక చాంగులేర్ కు చెందిన కళాకారులు చేసిన దండకాలు, ఖడ్గాలు, భజన కీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి.. శుక్రవారం 11 వరకు భజన సంకీర్తనలు కొనసాగాయి. కర్ణాటక బీదర్ కు చెందిన విద్యార్థులు నృత్యాలు భక్తులను మంత్రముగ్ధులు చేశాయి. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పీఠాధిపతులు అవధూత గిరి మహారాజ్, సిద్దేశ్వరానందగిరి మహారాజ్, గ్రామస్తులు ఉత్సవ కమిటీ సభ్యులు రమేష్ పాటిల్,బి, కృష్ణ ,కోట శ్రీనివాస్, దత్తు స్వామి, నాగన్న పాటిల్, కోట ఆశన్న, బోయిని ఎల్లన్న, వడ్ల సంగమేశ్వర్, న్యాల కాంటి దత్తు, తగు ఏర్పాట్లు చేశారు. వైదిక పాఠశాల విద్యార్థులు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

# ఓపెన్ కాస్ట్ గనుల్లో మహిళా ఆపరేటర్లకు అద్భుత అవకాశం

## ఈపీ ఆపరేటర్లుగా ఎంపికకు సర్టిఫికెట్ల ధృవీకరణ ఇంటర్వ్యూల నిర్వహణ



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే డిసెంబర్ 5: సింగరేణిలో ఓపెన్ కాస్ట్ గనుల్లో కూడా మహిళా కార్మికులకు అవకాశం కల్పించాలన్న సీఎండీ ఎన్.బలరామ్ ఆలోచన మేరకు సంస్థలో ప్రస్తుతం జనరల్ అసిస్టెంట్ గా లేదా బదిలీ వర్కర్లుగా పనిచేస్తున్న మహిళలకు సింగరేణి యాజమాన్యం తొలిసారిగా ఓపెన్ కాస్ట్ గనుల్లో భారీ యంత్రాలపై ఆపరేటర్లుగా పని చేయడానికి అవకాశం కల్పిస్తోంది. ఇటీవలనే దరఖాస్తులకు ప్రకటన చేయగా మొత్తం 43 మంది మహిళా కార్మికులు దరఖాస్తు చేశారు. వీరిలో ఇంటర్వ్యూలకు 35 మంది హాజరయ్యారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఎంపిక కమిటీ సభ్యులు జీఎం (సీపీపీ) ఏ.మనోహర్, జీఎం (పర్సనల్) ఐఆర్ %ఊ% పిఎం కవితా నాయుడు, జీఎం (ఓసీపీ) పి.ఎలిషా, సీఎంఓ ఆర్. కిరణ్ రాజ్ కుమార్, జీఎం (హెచ్ఆర్డి) ఆర్. విజయ ప్రసాద్, జీ ఎం (ఎంఎస్) బొజ్జా రవి మహిళా అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. ఈ సంధర్భముగా వారు మాట్లాడుతూ సంస్థ ఛైర్మన్ మేనేజింగ్ డైరక్టర్ ఆదేశాల మేరకు మహిళలు ఏ రంగంలోనైనా పురుషులతో సమానంగా పనిచేయగలరు అనే ఉద్దేశం తో ఓపెన్ కాస్ట్ గనుల్లో భారీ యంత్రాలపై ఆపరేటర్లుగా పనిచేడానికి ఆసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులను స్వీకరించటం జరిగిందని ఇది ఒక గొప్ప అవకాశం కనుక ఎంపికైన అభ్యర్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అభ్యర్థుల ధృవపత్రాల పరిశీలన అనంతరం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన మహిళా అభ్యర్థులకు మెడికల్ టెస్టుల అనంతరం సిరిసిల్లలో గల తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ సంస్థ హెవీ గూడ్స్ వెహికల్/ హెవీ మోటార్ వెహికల్ విభాగంలో 30 రోజుల శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం ఖాళీల లభ్యతను బట్టి ఈపీ ఆపరేటర్ ట్రైనీ కేటగిరి-5 డిసిగ్నేషన్ తో పోస్టింగ్ ఇవ్వబడుతుందని అధికారులు తెలిపారు. ఓపెన్ కాస్ట్ గనుల్లో మహిళలకు భారీ యంత్రాలపై ఆపరేటర్లుగా పనిచేసే అవకాశం సంస్థ ఛైర్మన్ చొరవతో సింగరేణి చరిత్రలో తొలిసారి కల్పించబడిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, వ్యక్తిగత అభివృద్ధితో పాటు కంపెనీ అభివృద్ధి కి కూడా పాటుపడాలని కోరారు.



## సాయుధ దళాల దినోత్సవం సందర్భంగా పతాక నిధికి కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తొలి విరాళం

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే డిసెంబర్ 5: జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సాయుధ దళాల దినోత్సవ పతాక నిధి కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ తొలి విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణలో అహర్నిశలు శ్రమిస్తున్న సైనికుల కోసం పతాక నిధికి ప్రతి పౌరుడు తన వంతు సహకారం అందించడం దేశభక్తి, సామాజిక బాధ్యతకు ప్రతీక అని తెలిపారు. కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ సరిహద్దుల్లో ప్రతికూల పరిస్థితుల్లో సేవలు అందిస్తున్న భారత సైన్యం, నౌకాదళం, వాయుసేన సిబ్బంది త్యాగాలను ప్రతి భారతీయుడు గౌరవించాలని అన్నారు. వీరి కుటుంబాల సంక్షేమం కోసం పతాక నిధి వినియోగించబడుతుందని పేర్కొంటూ జిల్లా ప్రజలు, విద్యాసంస్థలు, పారిశ్రామిక వర్గాలు, వ్యాపారవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొని విరాళాలు అందించాలని పిలుపునిచ్చారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీరజవాన్ల కుటుంబాల పట్ల సమాజం అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ అన్నారు. పతాక నిధి ద్వారా వీరమరణం పొందిన సైనికుల కుటుంబాలకు, సేవలలో గాయపడిన రక్షణ సిబ్బందికి ఆర్థిక సహాయం అందించబడుతుందని వివరించారు. ప్రతి సంవత్సరం సాయుధ దళాల దినోత్సవం సందర్భంగా ఈ నిధి సేకరణ ద్వారా దేశ రక్షణ వ్యవస్థ పట్ల ప్రజల సమగ్రత, ఐక్యత మరింత బలపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా సైనిక వెల్ఫేర్ అధికారి ఎం చంద్రశేఖర్, వింగ్ కమాండర్ రిటైర్డ్ సురేందర్, ఆర్మీ రిటైర్డ్ సుభాని, కృష్ణమూర్తి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల,స్వర్ణోత్సవ గోల్డెన్ జూబ్లీ వేడుకలు

### పూర్వ విద్యార్థుల సమక్షంలో చారిత్రక వేడుకలు



నాగార్జునసాగర్ డిసెంబర్ 5 వాయిస్ టుడే ప్రతినిధి: రాష్ట్ర విద్యారంగంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని,కీర్తిని సంపాదించుకున్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల,స్వర్ణోత్సవ గోల్డెన్ జూబ్లీ వేడుకలు ఈ ఏడాది నాగార్జున సాగర్ లో చారిత్రక ఘట్టానికి సిద్ధమవుతోంది. 1975లో స్థాపించబడి,ఐదు దశాబ్దాల పాటు ఎందరో ప్రతిభావంతులైన విద్యార్థులను తీర్చిదిద్దిన ఈ విద్యా సంస్థ,స్వర్ణోత్సవ గోల్డెన్ జూబ్లీ వేడుకలను వైభవంగా జరుపుకోనుంది ఈనెల 14న నాగార్జునసాగర్ పట్టణంలో జరిగే స్వర్ణోత్సవాల ఆత్మీయ సమ్మేళనం లో దేశ విదేశాల నుండి పెద్దఎత్తున పూర్వ విద్యార్థులు పాల్గొంటారనరు,ఈ ఏర్పాట్లను ఏపీఆర్జేఏసీ,నాగార్జునసాగర్ గోల్డెన్ జూబిలీ సెలెబ్రేషన్స్ ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్ శ్రీ ఏ.సైదా రెడ్డి కో ఛైర్మన్ ఎస్ నాగాచారి

డా.కె.వీరనంది,జీ.గోపాలరావు సమన్వయం చేస్తున్నారు,అయితే ఈ వేడుకల్లో డిసెంబర్ 13న గురు సత్కారం వేడుకలు జరగనున్నాయి,ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి,విశిష్ట అతిథిగా వి.ఎన్.మస్తానయ్య,సెక్రటరీ రానున్నారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థి సంఘం ప్రతినిధులు రమేశ్ నాయుడు,తెలిపిన వివరాల ప్రకారం విద్యాసంస్థ 50 ఏళ్ల సువర్ణ ప్రయాణాన్ని స్మరించుకుంటూ ఈ వేడుకలు అందరు,గురువులు,పూర్వవిద్యార్థులు,విద్యార్థులు,ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొనను ఉన్నారని ఆయన వెల్లడించారు.

# ‘మానే’ ప్యానల్ కు ఓటు... అభివృద్ధికి తోడ్పాటు

## ఎమ్మెల్సీ తాతా మధు



భద్రాచలం, డిసెంబర్ 05 (వాయిస్ టు డే ): భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ ఎన్నికల్లో "సర్పంచ్ గా పోటీ చేస్తున్న మానే రామకృష్ణ ప్యానల్ కి ఓటు వేసి అభివృద్ధి కి తోడ్పడాలని బి ఆర్ ఎస్ నాయకులు, ఎమ్మెల్సీ తాతా మధు కోరారు. ఈ ఎన్నికల్లో బి ఆర్ ఎస్ సిపిఎం, జిడిపి, ఆదివాసి జేఏసీ కూటమి గా ఏర్పడి సర్పంచ గా బి ఆర్ ఎస్ నాయకులు మానే రామకృష్ణ ను పోటీకి నిలిపాయని ఆయన తెలిపారు. ఈ కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం జరిగిన సభ లో తాతా మధు మాట్లాడుతూ కాంగ్రెస్, బిజెపి కూటమి అభ్యర్థుల సంగతి, వారి వ్యాపార, వ్యవహారాల గురించి స్థానికులకు అందరికీ తెలిసిందేనని వ్యాఖ్యానించారు. మానే రామకృష్ణ ప్యానెల్ గెలుపు కోసం కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పట్టణంలో ఎవరిని అడిగినా మానే మంచితనం గురించి చెబుతున్నారని ప్రశంసించారు. ఎవరెన్ని పార్టీలు మారినా, ఎన్ని అవతారాలు ఎత్తినా భద్రాచలంలో మానే రామకృష్ణ బీఆర్ఎస్ ని అంటిపెట్టుకొని నాటి ఉద్యమ కాలం నుంచి నేటి వరకు కూడా ప్రజాక్షేత్రంలోనే ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలను వాయిదా వేస్తూ వచ్చిందని..బీసీలను మభ్యపెడుతూ వారి రిజర్వేషన్ అంశంలో నిలువునా మోసం చేసిందని ఆయన విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవికుమార్ మాట్లాడుతూ

సర్పంచి అభ్యర్థిగా బరిలో నిలిచిన మానే రామకృష్ణ ఇతర అభ్యర్థులతో ఏ విషయంలో పోల్చి చూసినా ఉత్తముడని పేర్కొన్నారు. మానే విజయం దాదాపు ఖాయమైపోయిందని అన్నారు. అక్రమ వ్యాపారాలు, అక్రమ దందాలకు పాల్పడిన వారు ఎన్నికల్లో పోటీ చేస్తుంటే ప్రజలు చూస్తూ ఊరుకోరని ఆయన హెచ్చరించారు. భద్రాచలం సంస్కృతి చాలా గొప్పదని, ఇక్కడి రాజకీయాలు కూడా క్రమశిక్షణాయుతంగా ఉంటాయని అన్నారు. దుర్మార్గులను ప్రజాక్షేత్రంలోకి రానివద్దని పిలుపునిచ్చారు. గంజాయికి, డ్రగ్స్ కు భద్రాచలం కేంద్రం కాకుండా చూడాలని కోరారు. రాజకీయాలకతీతంగా ఆలోచించి బిజెపి,టిడిపి,జనసేన కూటమిని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఓడించి వారికి తగు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆనాటి ముఖ్యమంత్రి కెసిఆర్ అనేక అభివృద్ధి పనులు చేశారని టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాకేష్ రెడ్డి అన్నారు. భద్రాచలం గ్రామపంచాయతీ కార్యాలయంపై కూటమి జెండా ఎగరాలని గోండ్వాన దండకారణ్య పార్టీ రాష్ట్ర నాయకులు గుండు శరత్ కోరారు. ఉద్యమ పార్టీల కలయికతో కాంగ్రెస్,బిజెపి తదితర బూర్జువా పార్టీలు కొట్టుకుపోవటం ఖాయమని అన్నారు. భద్రాచలం గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి మానే రామకృష్ణ దొరకటం తమ అదృష్టం అని టిఆర్ఎస్ పార్టీ నాయకులు రావులపల్లి రాంప్రసాద్ అన్నారు.

ఉద్యోగాన్ని సైతం వదిలి ప్రజాక్షేత్రంలో మానే రామకృష్ణ సేవలు అందిస్తున్నారని అన్నారు. డబ్బే ప్రధానం కాదని, మానే గెలుపును ఆపటం ఎవరి తరం కాదని ఆయన వ్యాఖ్యానించారు. భద్రాచలం పట్టణ అభివృద్ధి కోసం తాను సర్పంచ్ బరిలో నిలిచానని, ప్రజల ఆశీర్వదించాలని మానే రామకృష్ణ పేర్కొన్నారు. అన్ని వార్డుల్లో నూ కూటమి అభ్యర్థులను కోరారు. ప్రచార సందర్భంగా తనకు తెలుపుతున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, నాయకులు ఏజే రమేష్, బిఆర్ఎస్ భద్రాచలం మండల కన్వీనర్ ఆకోజ్ సునీల్ కుమార్ ప్రసంగించారు.



## ఘనంగా పాల ఉట్లు.. పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు

మక్తల్, డిసెంబర్ 5 వాయిస్ టుడే ప్రతినిధి : మఖ్తల్ పడమటి ఆంజనేయ స్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం పాల ఉట్ల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలిరాగా... రాంలీలా మైదానంలో భక్తుల కేరింతల మధ్య ఉట్లను కొట్టారు. అంతకు ముందు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ప్రాణేశాచారి, ఈవో కవిత, అర్చకులు అరవిందాచారి ఆనంద తీర్థ చారి, విష్ణు తీర్థ చారి, శ్రీనివాస్,నాయకులు బి కొండయ్య, బాలకృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గుప్తా, నరసింహ గౌడ్,కొల్ల వెంకటేష్, నరసింహారెడ్డి,రాజశేఖర్ రెడ్డి, కట్టా సురేష్ గుప్తా, గణేష్ కుమార్, ఎం రవి కుమార్, కల్లూరు నాగప్ప,ధార్మిక సంస్థల ప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## పని ప్రదేశంలో లైంగిక వేధింపులు జరగకుండా చూడాలి

రాజన్న సిరిసిల్ల జిల్లాబీ డిసెంబర్ 05: సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ప్రతి పని ప్రదేశంలో ఇంటర్నల్ కమిటీ అంతర్గత కమిటీ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని జిల్లా సంక్షేమ అధికారి పీ లక్ష్మీరాజ్యం సూచించారు. శుక్రవారం రోజు అపరెల్ పార్కులోని పంక్చుయేట్ వరల్డ్ ప్రయివేట్ లిమిటెడ్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ ఆవరణలో అంతర్గత కమిటీ పనితీరును పరిశీలించారు. కార్మికులతో మాట్లాడి వారికి అందుతున్న ప్రయోజనాలు, పని ప్రదేశంలో స్థితిగతుల గురించి పరిశీలించారు. అలాగే మేనేజ్మెంట్ సభ్యులతో మాట్లాడి ప్రతి ఒక్కరి హక్కులను కాపాడాలని సూచించారు. అలాగే ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక వాతావరణంలో పని ప్రదేశం ఉండాలని, పని ప్రదేశంలో సరైన భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు మానసిక ఉల్లాసానికి చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే క్రచ్ పిల్లల డేకేర్ సెంటర్ లో పిల్లలకి అందుతున్న సేవలను పరిశీలించారు.

## పందిళ్ళ గ్రామ సర్పంచ్ బరిలో శ్రామికుడు సేవకుడు తోడేటి రమేష్

### నిజాయితీపరుడు నిస్వార్థ సేవకుడు మరోసారి అవకాశం కల్పించాలని అభ్యర్థన: మాజీ సర్పంచ్ తోడేటి రమేష్



వాయిస్ టుడే ప్రతినిధి డిసెంబర్ 6హుస్నాబాద్ ప్రతినిధి: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పందిళ్ల గ్రామ సర్పంచ్ గా తోడేటి రమేష్ నామినేషన్ వేశారు. ఈ సందర్బంగా తోడేటి రమేష్ మాట్లాడుతూ గత సర్పంచ్ గా ఐదు సంవత్సరాలు సర్పంచ్ కొనసాగానని గ్రామంలోఎన్నో అభివృద్ధి పనులు చేపట్టానని అన్నారు. గ్రామంలో మిగిలి ఉన్న సీసీ రోడ్ల నిర్మాణం, రెండవ మహిళ గ్రూప్ సభ్యులకు భవనం, కమాన్ నుండి ఇరువైపుల కమ్మరి కట్ట వరకు డ్రనేజ్ నిర్మాణము, నిరుద్యోగ యువతకు వివిధ కంపెనిల ద్వారా ఉపాధి కల్పిస్తానన్నారు.రెండు గ్రామాల మధ్య విధిలైట్లు,గ్రామములో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తానన్నారు. అర్హులకు రేషన్ కార్డులు ఇండ్లు వివిధ పథకాలు ఇప్పిస్తానన్నారు. గ్రామ సర్పంచ్ గా మరోసారి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. అంతేకాకుండా మరోసారి అవకాశం ఇస్తే పందిళ్ళ గ్రామాన్ని రాష్ట్రంలోని ఆదర్శ గ్రామంగా తీర్చినని ఐదు సంవత్సరాలు సర్పంచిగా ప్రజలకు సేవ చేసి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ గ్రామపంచాయతీ ఉత్తమ సర్పంచ్ అవార్డు ను తీసుకున్నానని మరోసారి అవకాశం ఇస్తే రాష్ట్రస్థాయిలో పందిళ్ళ గ్రామం అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తానని తెలియజేశారు

## తూకంలో తేడాలు... భగ్గుమంటున్న అన్నదాతలు

హైదరాబాద్, డిసెంబర్ 5, (వాయిస్ టుడే)

రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని చెప్తున్న మరోవైపు అధికారులు ఆచరణలో విఫలమవుతున్నారు. రైతులకు గిట్టుబాటు ధరను అందిస్తామని భరోసా ఇచ్చిన కార్యాచరణ లో మాత్రం అమలు చేయడం లేదు. సకాలంలో రైతుల ధాన్యానికి తూకం జరగకపో వడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధాన్యాన్ని ఎండలో ఆరబోసాం.. తూకం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ధాన్యానికి సకాలంలో తూకం జరుగకకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 15 రోజుల నుంచి ధాన్యాన్ని ఆరబోసుకొని కూర్చున్నా ధాన్యానికి తూకం వేయడం లేదు. స్థానిక సింగిల్ విండో అధికారులు ఏమాత్రం పట్టనట్టు వివరిస్తున్నారు. ఈ విషయమై అధికారులకు చెప్పిన పట్టించు కోవడం లేదని కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలోని రైతులు బోరుమంటున్నారు. ప్రభుత్వం వరి ధాన్యానికి మద్దతు ధర అందించి ఆదుకుంటామని భరోసా ఇచ్చింది కానీ సకాలంలో రైతుల ధాన్యానికి తూకం వేయడం లేదు. అధికారులు ఇలా వచ్చి అలా వెళ్ళిపోతున్నారే కానీ రైతుల పరిస్థితిని పట్టించుకోవడంలేదని వారు మండి పడుతున్నారు. తాడ్వాయి మండలంలోని నందివాడ, కృష్ణాజివాడి, బ్రాహ్మణపల్లి, తాడ్వాయి గ్రామాల్లో రైతులు కల్లాల్లో దాన్యాన్ని ఆరబోసి తూకం కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. అధికారులు సకాలంలో స్పందించి వెంటనే తూకం వేయాలని రైతులు కోరుతున్నారు. తమ ధాన్యాన్ని ఆరబోసుకొని తూకం కోసం ఎదురు చూస్తున్నారు. ఎప్పుడు వచ్చి తమ ధాన్యానికి తూకం వేస్తారని ఆరాటపడుతున్నారు. అయినా అధికారులు స్పందించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని గ్రామాలలో అధికారులు తూకం వేసిన ధాన్యాన్ని తరలించడం లేదు. దీంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.